# అక్రమాలకు కళ్లెం

★ అందుకే ఈపోస్ యంత్రాల అమలు ★ పౌరసరఫరాల శాఖ సంచాలకుడు రవిబాబు

**అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే :** చౌకధరల దుకాణాల్లో అవినీతి, అక్రమాలను నివారించేందుకే ఈపోస్ యంత్రాలు ఏర్పాటు చేశామని పౌరసరఫరాశాఖ సంచాలకుడు జి. రవిబాబు తెలిపారు. ఒక నెల పాటు ఈ విధానంతో తగ్గిన అక్రమాల వల్ల ఎంత డబ్బు మిగులుతుందో పరిశీలించి, దాంతో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని యోచిస్తున్నామన్నారు. చాలామంది రక్తహీనతతో బాధపడుతున్నారని, దానికి సంబంధించి ఏ సరకులు ఇవ్వాలో అనేదానిపై ఆలోచిస్తున్నామన్నారు. తమ పర్యటనలో భాగంగా ఆదివారం సాయంత్రం పౌరసరఫరాశాఖ సహాయాధికారులు విలియమ్స్, పాపారావులతో పాయకాపురంలోని 108 డిపోను పరిశీలించారు. అక్కడ ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే డీలర్లు కూడా తమ కష్టాలను వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఈపోస్ యంత్రాల ద్వారా నిత్యావసర సరకులు అందించేందుకు ప్రభుత్వం చేసిన కృషి ఎనలేనిదన్నారు. ప్రస్తుతం ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ల ద్వారా యంత్రాలు పని చేస్తున్నాయని, భవిష్యత్‌లో శివారుల్లో కూడా సక్రమంగా వచ్చే నెట్ వర్క్‌లను తీసుకుంటామన్నారు. ఈ నెలంతా ప్రయోగాత్మకమని, వచ్చే నెల నుంచి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరకులు ఇస్తారన్నారు.



పాయకాపురంలో పర్యటిస్తున్న రవిబాబు

## ఏప్రిల్ నుంచి ఒక్కొక్కరికీ 5 కిలోల బియ్యం

ఏప్రిల్ నుంచి కుటుంబంలో ఒక్కొక్కరికీ 5 కిలోలు చొప్పున బియ్యం ఇవ్వనున్నట్లు రవిబాబు తెలిపారు. ఆహార భద్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. ఇంతేకాక ఉప్పు కూడా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## డీలర్ల కష్టాలనూ పరిష్కరిస్తాం

కొంతమంది డీలర్లు రహస్యంగా కార్యకలాపాలు సాగించి గతంలో అనేక అక్రమాలకు పాల్పడేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా చేస్తున్నామని చెప్పారు. ఒక్కో రేషన్‌కార్డుకు రూ.10, బియ్యం క్వింటాకు రూ.40, పంచదార క్వింటాకు రూ.100, గోధుమలు క్వింటాకు రూ.40తోపాటు చాలా సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. గతంలో వారే గోదాముకు వెళ్లి సరకులు తెచ్చుకునే వారని, వారికి క్వింటాకు రూ.20 ఖర్చు అయ్యేదని, ఈ విధానంతో రూ.7 మాత్రమే అవుతాయని చెప్పారు. భవిష్యత్‌లో వీరికి పింఛన్లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని, ఇంకా ఆదాయం పెరుగుతుందని తెలిపారు. ఒక్కో డీలరుకు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఏప్రిల్ 1 నుంచి పూర్తిస్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా ఈపోస్ యంత్రాలు పని చేస్తాయన్నారు.

## వేలి ముద్రలు పడకపోతే ఐరిష్ తీస్తాం..

రేషన్ డిపోల్లో కొంతమంది వేలుముద్రలు పడటం లేదని చెబుతున్నారని, అటువంటి వారికి ఇబ్బంది లేకుండా ఐరిష్ కూడా తీసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి నెలా వారు ఇబ్బంది పడకుండా ఐరిష్ తీసి నిత్యావసరాలు అందిస్తామని చెప్పారు. గతంలో విజయవాడ నగర కమిషనర్‌గా పని చేసిన జి.రవిబాబు పాయకాపురం ప్రాంతంలో కొద్దిసేపు పర్యటించి ప్రజలతో మాట్లాడారు.